క్లుప్తంగా

రేపు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి షుగర్ పరీక్షల అనంతరం సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడపున ఏమి తినకుండా ఆసుపత్రి వద్దకు రావాలన్నారు. షుగర్ వ్యాధితో బాధపడుతున్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568 286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి రామసుబ్బారెడ్డి

వీరపునాయునిపల్లె : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం నోడల్ అధికారి రామసుబ్బారెడ్డి ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి గ్రామాల్లో మంచి స్పందన లభిస్తోందన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వైద్యం చేయించుకుంటున్నారన్నారు. అనంతరం మండలంలోని వెల్దుర్తి ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఎర్రగుంట్ల : పట్టణ పరిధి, మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ సుబ్బయ్య తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి హనుమాన్ జయంతి ఉత్సవాలు

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం నుంచి రెండు రోజులపాటు హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ కె.వెంకటేష్‌లు తెలిపారు. ఈనెల 13వ తేదీన శనివారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అభిషేకం, లఘు పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం ఆ వీరాంజనేయస్వామి మూలమూర్తికి పరిమళ ద్రవ్యాలతో విశేష అలంకరణ ఉంటుందన్నారు. రెండు రోజులపాటు జరిగే ఉత్సవాలలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు ఉచిత ఒడుగుల కార్యక్రమం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక పాత ఈద్గాలో శనివారం ఉదయం 6.30గంటల నుంచి సాయంత్రం వరకు పులివెందుల పట్టణ, చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు ఉచిత ఒడుగుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్లాహ్ మౌలానా, ముఫ్తీ కలీముల్లాహ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద పిల్లలకు, అనాథ పిల్లలకు ఈ కార్యక్రమం ఎంతో అవసరమని.. ఈ కార్యక్రమంలో ఉచితంగా మందులు, పండ్లు, ఫలహారాలు, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నిషేధిత పురుగు మందులు అమ్మితే చర్యలు

పెండ్లిమర్రి : పురుగు మందుల దుకాణాదారులు ప్రభుత్వం నిషేధించిన పురుగు మందులను రైతులకు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్బారావు హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఎరువులు, పురుగు మందుల డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డీలర్ స్టాక్ రిజిస్టర్ తప్పనిసరిగా పెట్టాలన్నారు. పురుగు మందులు విక్రయించేటప్పుడు రసీదు తప్పని సరిగా రైతులకు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ రేట్ల కన్నా అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిని బ్లెస్సీ, ఏఈఓలు గంగాప్రసాద్, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో రెమిడియల్ కాసులను ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులచే రెమిడియల్ తరగతులు, నాడు–నేడు పనులు పర్యవేక్షణ, వి లవ్ రీడింగ్ వంటి పనులు చేయిస్తున్నారని వీటికి సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలన్నారు. నాన్ వేకేషన్ డిపార్టుమెంట్‌గా పరిగణించి ఉత్తర్వులు ఇవ్వాలన్నారు.

పేద వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు తెలిపారు. శుక్రవారం 18వ డివిజన్ పరిధిలోని సాయినగర్, విశ్వనాథపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారికి ప్రభుత్వ పథకాలగురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లులేని పేద ప్రజలకు ఇంటి స్థలం ఇచ్చి వారు ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థిక సహకారం అందిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో రూ.2,750 పెన్షన్ ఇస్తున్నామన్నారు. చదువుకునే పిల్లలు తల్లిదండ్రులకు భారం కాకూడదనే అమ్మ ఒడి అందజేస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి నెల మేనిఫేస్టోలో చెప్పినవిధంగా సంక్షేమ పథకాలను మన ముఖ్యమంత్రి ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, సర్పంచులు సురేంద్రారెడ్డి, మల్లికార్జున యాదవ్, సుబ్బరాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు రాజారెడ్డి, గజ్జల శ్రీరామిరెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్‌గుత్తిరెడ్డి చంద్రహాస్‌రెడ్డి, 16వ డివిజన్ నాతిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, నాయకులు గజ్జల ఈశ్వర్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, పల్లవలి చంద్రశేఖర్‌రెడ్డి, కమలకూరుఇ శ్రీనివాసరెడ్డి, మోద్దీన్, కోకటం లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఆయన ప్రవేశపెట్టిన పథకాలే అందుకు నిదర్శనమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సిబ్బందికి ఎమ్మెల్యే ఆదేశించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలను నెరవేర్చి చరిత్ర సృష్టించారన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చేందుకు ఆయన ఆవిష్కరించిన గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. చాలా రాష్ట్రాలు మన రాష్ట్రంలోని గ్రామ సచివాలయ వ్యవస్థలను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనే ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, దేవానంద్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, హౌసింగ్ డైరెక్టర్ డేవిడ్, ఎంపీటీసీ సభ్యులు కొండయ్య, మాజీ సర్పంచ్ కొండారెడ్డి, రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, మాజీ ఎంపీటీసీలు ప్రతాప్‌రెడ్డి, ముస్తాఫ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్యే

ముద్దనూరు : జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక శివాలయం సమీపంలోని మైదానంలో మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో కలిసి ఆయన హైస్కూల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ పోటీల్లో విన్నర్స్ జట్టుకు రూ.50 వేలు, రన్నర్‌జట్టుకు రూ.30 వేలు నగదు బహుమతిగా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్‌లను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రాయితీతో అందించే కిసాన్ డ్రోన్‌లను సద్వినియోగం చేసుకోవాలని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ సభా భవనంలో మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనునిత్యం రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం పాటుపడుతోందని ప్రభుత్వం అందించే పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవడంతో పాటు భూసార పరిక్షలు తప్పకుండా చేయించుకోవాలని ఆయన కోరారు. కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ సూక్ష్మ, తుంపర సేద్యానికి సంబంధించి రైతు భరోసా కేంద్రాల వారిగా లక్ష్యాలను అధిగమించవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్ బాబు మాట్లాడుతూ 2023 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసా మొదటి విడత అర్హుల జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. జాబితాలో పేర్లు లేని వారు ఎవరైనా ఉంటే ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ లోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఈకేవైసీ చేయించుకోని రైతులు ఉంటే వెంటనే చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మండలి సభ్యులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం ఎస్‌ఐగా ఎస్‌కే రోషన్



సింహాద్రిపురం : స్థానిక పోలీస్‌స్టేషన్‌కు నూతన ఎస్‌ఐగా ఎస్‌కే రోషన్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప చిన్నచౌక్ ఎస్‌ఐగా విధులుగా నిర్వహిస్తూ బదిలీపై సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండల ప్రజలు ఏవైనా సమస్యలుంటే స్టేషన్‌కు వచ్చి పరిష్కరించుకోవాలని.. చట్టాన్ని చేతిలోకి తీసుకుని దౌర్జన్యం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మండల ప్రజలు కూడా ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డిని బదిలీ కావడంతో పోలీసు సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డిలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

జమ్మలమడుగు : పట్టణంలోని పతంగేరామన్నరావు క్రీడా మైదానంలో ఎద్దుల పోటీలు రసవత్తరంగా సాగాయి. నారాపురవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవాం ఉదయం ఆరుపళ్ళ ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. శనివారం ఉదయం సీనియర్ ఎద్దుల పోటీలు జరుగుతాయన్నారు. రైతులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ములంబాయి హృషికేశవరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కొండాపురం : మండల పరిధి లావనూరు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు స్థానిక సమాచారం ఇవ్వడంతో పేకాట స్థావరంపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ 2050 నగదు పేకాట ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

జమ్మలమడుగు : ఆస్థానయే గౌసియా 91వ ఉరుసు మహోత్సవం సందర్భంగా నిర్వహించే మెడికల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి కుమారుడు సయ్యద్ షా తాహీర్‌పీరాఖాద్రీ శుక్రవారం స్థానిక ఆస్థానయే గౌసియాలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 23వ తేదీన ఉదయం తొమ్మిది గంటలనుంచి హిజమా(కప్పింగ్ థెరఫీ) గౌసియా షాదీఖానాలో నిర్వహిస్తారన్నారు. 28వ తేదీ ఆదివారం భారీగా మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య చికిత్స అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజలు ఈ రెండు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆస్థానయే గౌసియా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, సాబీర్ ఖాద్రీ, ఎంఎం బాషా, యాసిన్, చాపాడు మహమ్మద్ గౌస్, రజాక్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



ప్రత్యేక అలంకరణలో గోదా మహాలక్ష్మీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో వెలసిన శ్రీ గోదా మహాలక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయలో త్రయోదశ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో శుక్రవారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరుకు చెందిన రామకృష్ణ సిద్ధాంతి ఉపన్యాసం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారి కల్యాణంను తిలకించారు. వేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కల్యాణ వైభోగమే!



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. భక్తులు విశేష సంఖ్యలో కల్యాణోత్సవానికి హాజరయ్యారు. కల్యాణం అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. కనుల పండువైన అలంకారంలో ఉన్న స్వామి, అమ్మవార్లను తిలకించిన భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అర్చకులు వారికి మంగళ హారతులు ఇచ్చారు.

● కడప నగర పరిధిలోని ఆలంఖాన్‌పల్లె వద్దగల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం కల్యాణోత్సవానికి హాజరు కావడం పవిత్ర కార్యక్రమంగా భావించిన స్థానిక భక్తులు విశేష సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు క్రమంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు



పులివెందుల గ్రంథాలయంలో కథలు చెబుతున్న విద్యార్థిని



వేంపల్లెలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ వి.సునీత

పులివెందుల టౌన్ : పట్టణంలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్రవా రం లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో వి ద్యార్థులకు నీతి కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం తదితర శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు రిటైర్డు టీ చర్ బండి రామచంద్రారెడ్డి సమోసాలను పంపి ణీ చేశారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థు లు పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యం

వేంపల్లె : పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ వి.సునీత తెలిపారు. శుక్రవారం స్థానిక క్రిష్టియన్‌లైన్‌లోని అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో వేంపల్లె-1 సెక్టార్‌లో సంసిద్ధత ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శారీరకాభివృద్ధి, బుద్ధి వికాసం, గణిత భాషాభివృద్ధి, సృజనాత్మకత అంశాలపై ప్రథమ్ సంస్థ సూపర్ ట్రైనర్ స్వరూపరాణి చిన్నారులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారం తప్పక అందించాలని సూచించారు. తల్లి పాలతోపాటు బలవర్ధకమైన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీగాయత్రి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రావణి, హెడ్మాస్టర్ గోవిందు, జీఎంఎస్‌కే అర్చన, ఆశా మాలిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లలు, తల్లులు హాజరయ్యారు.

మేధస్సును పెంచే క్రీడ చెస్

కమలాపురం : చెస్ క్రీడ మేధస్సును పెంచుతుందని కమలాపురం శాఖా గ్రంథాయలాధికారిణి నాగాంజలి తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం చెస్ క్రీడలో ఆమె విద్యార్థులకు శిక్షణనిచ్చారు. అలాగే వివిధ అంశాల్లో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చెస్‌లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు.. తప్పిన ప్రమాదం



ఇంటి ఎదుట తెగిపడిన విద్యుత్ తీగలు

కొండాపురం : స్థానిక శాంతినగర్ కాలనీలో శుక్రవారం సాయంత్రం విద్యుత్ వైర్లు గృహాలు, రోడ్డుపై తెగిపడ్డాయి. అయితే అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. పట్టణంలోని విద్యుత్ కనెక్షన్లకు తగినంతగా సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో ఉన్న విద్యుత్ వైర్లపైన లోడ్ అధికం కావడంతో విద్యుత్ వైర్లు తెగిపడుతున్నా యన్నారు. వారం రోజుల క్రితం పట్టణంలోని సీఎంఆర్ కాలనీ సమీపంలో విద్యుత్ మంటలు చెలరేగాయన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి పట్టణంలో సరిపడా విద్యుత్ ట్రాన్సుఫార్మర్లు, విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత

వైవీయూ : మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత అని వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూ బొటానికల్ గార్డెన్‌ను ఆయన సందర్శించి మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా గార్డెన్‌లోని వివిధ జాతుల మొక్కల సంరక్షణ, అంతరించిపోతున్న జాతుల మొక్కల పెంపకం గురించి గార్డెన్ బాధ్యులు ఆచార్య ఎ. మధుసూదన్‌రెడ్డి వీసీకి వివరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గార్డెన్ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకారం అందిస్తామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, డా. ఎస్.వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విలువలు తెలిపేందుకే శిబిరం

కడప కల్చరల్ : విలువల గురించి బాలలకు తెలియజెప్పేందుకే ప్రత్యేకంగా వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం మంచి కార్యక్రమమని కడప నగరానికి చెందిన విద్యావేత్త పద్మనాభరెడ్డి అన్నారు. స్థానిక ఓం శాంతినగర్‌లోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా వేసవి సెలవుల శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఓం శాంతి సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ గీతా బెహన్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మనాభరెడ్డి మాట్లాడుతూ ధార్మిక సంస్థలు బాలల్లో విలువలు నింపేందుకు ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 15వరకు రోజూ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు.

సీపటీసీ క్యాంపులో జిల్లా కేడెట్స్ ప్రతిభ

వైవీయూ: చిత్తూరులో ఈనెల 4 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన కంబైన్డ్ ఆన్యువల్ ట్రెనింగ్ క్యాంపులో కడప 30 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కేడెట్స్ చక్కటి ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం సాధించారు. క్యాంపులో తల్‌సైనిక్ క్యాంపు ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్ నిర్వహించగా అన్ని రంగాల్లో రాణించి రెండోస్థానంలో నిలిచారు. క్యాంపులో మ్యాప్‌రీడింగ్, గుడారాల నిర్మాణము, ఆరోగ్య విద్య, ఆప్టికల్స్, ఫైరింగ్‌లలో పోటీలను నిర్వహించారు. కేడెట్స్‌ను 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా అభినందించారు.

ఘనంగా ప్రారంభమైన సుంకులమ్మ తిరునాల



అలంకరణలో సుంకులమ్మ అమ్మవారు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధి సమీపంలో చెరువుకట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ తల్లి అష్టమ తిరునాల మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తదితర పూజలు నిర్వహించి సాయంత్రం మహా మంగళహారతి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

అలరించిన ముగ్గుల పోటీలు :

మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 19 మంది మహిళలు ముగ్గులు వేశారు. వారిలో గొంగల్‌రెడ్డి భవాని వేసిన అమ్మవారి ముగ్గు ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే ఉమామహేశ్వరీ, రేణుకాదేవి, లక్ష్మీదేవి, శారద, వడ్డే భవానీలు తర్వాత స్థానాల్లో నిలిచారు. గెలుపొందిన విజేతలకు చవ్వారెడ్డి రామసుబ్బారెడ్డి భార్య దేవసేనమ్మ వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి. రూ.500 నగదు బహుమతులను మాజీ మంత్రి మైసూరారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీఎస్ నారాయణరెడ్డి తెలిపారు. మాజీ మంత్రి ఎంవీ మైసూరారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రామప్రసాద్‌రెడ్డి, ఓ.శ్రీనివాసులరెడ్డి, మునిరెడ్డి సుబ్బారెడ్డి, పిచ్చిరెడ్డి, ఏవీ రమణ, సున్నపు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.